సాక్షి ఖమ్మం

ఆదివారం । 14 । మే । 2023



మాయమాటలతో నగదు స్వాహా

చింతకాని మండలంలోని ఇద్దరికి మాయమాటలు చెప్పిన సైబర్ నేరగాళ్లు రూ.3.15లక్షల మేర స్వాహా చేశారు. 10లో



రెండో రోజుకు చేరిన కబడ్డీ టోర్నీ

జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీ రెండో రోజు హోరాహోరీగా సాగింది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
45° / 26°

వాతావరణం

జిల్లాలో ఆదివారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు

స్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తి



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న జిల్లా జడ్జి దంపతులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం చేశాక, స్వామి, అమ్మ వార్లను పట్టువస్త్రాలతో అలంకరించి తెలంగా, ఏపీ నుంచి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్య కల్యాణం జరిపించారు. కాగా, స్వామిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ దంపతులు, మధిర కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్‌రెడ్డి దర్శించుకున్నారు. అలాగే, శ్రీవారికి పల్లకీ సేవ నిర్వహించాక భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడు

ఖమ్మంమయూరిసెంటర్: జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడు అనంతనాయక్ ఈనెల 15న ఖమ్మం రానున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఖమ్మం చేరుకోనున్న ఆయన సాయంత్రం నాలుగు గంటలకు గిరిజన నాయకులు, ఎన్జీవోలతో సమావేశమవుతారు. ఆ రాత్రి ఇక్కడే బస చేసి 16వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్, జిల్లా అధికారులతో గిరిజన సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించాక ఆదిలాబాద్ జిల్లాకు బయలుదేరతారు.

సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం..

ఖమ్మంమయూరిసెంటర్: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జిల్లా కౌన్సిల్ అత్యవసర సమావేశం ఈనెల 15న ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతారని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, ఖమ్మం పట్టణ కార్యవర్గ బాధ్యులు హాజరుకావాలని కోరారు.

18న సీనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 18న జిల్లాస్థాయి సీనియర్ మహిళలు, పురుషుల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఆసక్తి కలిగిన అథ్లెట్లు వయస్సు ధృవీకరణ పత్రాలతో ఉదయం 8గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 25, 26 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

చీమలపాడు బాధితులకు ఎంపీ పరామర్శ



ఆస్పత్రిలో కుమార్‌ను పరామర్శిస్తున్న ఎంపీ, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: కారేపల్లి మండలం చీమలపాడులో గతనెలలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా గాయపడిన వారిని ఎంపీ నామా నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. ఘటనలో ఓ కాలు కోల్పోయి ఖమ్మంలోని ఇంటి వద్ద ఉన్న హెడ్ కానిస్టేబుల్ నవీన్‌ను ఎంపీ పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. అలాగే, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగోతు రవికుమార్‌ను కూడా ఎంపీ పరామర్శించి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేయడంతో పాటు మూడు చక్రాల వాహనాన్ని నామా ట్రస్ట్ ద్వారా అందిస్తానని హామీ ఇచ్చారు. రైతుబంధు సమితి అధ్యక్షుడు నల్లమోతు వెంకటేశ్వర్లు, ఎంపీపీ మాలోతు శకుంతల, సర్పంచ్ కిషోర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్‌తో పాటు దేగల ఉపేందర్, బత్తుల శ్రీనివాసరావు, ఎర్రబెల్లి రఘు, కోటి పాల్గొన్నారు.

పాలిచ్చి... పాలించి!



పిల్లలకు భోజనం తినిపిస్తున్న సీఐ అంజలి



విధినిర్వహణలో సీఐ అంజలి (ఫైల్)

- ఆమె ఉద్యోగం చేయగలదు..
- కుటుంబ బాధ్యతలనూ సమర్థంగా నిర్వర్తించగలదు..
- లేవలేని కుమారుడికి ఎన్నేళ్లు వచ్చినా చిన్నపిల్లాడిలాగే సేవ చేయగలదు..
- పురుషులకు దీటుగా వ్యాపారంలో రాణించగలదు..
- రాజకీయాల్లోనూ సత్తా చాటగలదు...
- భర్త, కుటుంబం దూరమైనా పిల్లలను తీర్చిదిద్దగలదు..

ఇలా చెప్పుకుంటూ పోతే మహిళల జీవితంలో భిన్న పార్శ్వాలు, అద్భుత విజయాలు కనిపిస్తాయి. ఆమె లేనిదే ఒక నిమిషం గడపలేని కుటుంబాలెన్నో ఉన్నాయి. విద్య, వ్యాపార, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణిస్తూనే కుటుంబ బాధ్యతలనూ అదే స్థాయిలో విజయవంతంగా నిర్వర్తించే మహిళలు మన కళ్ల ముందే ఉన్నారు. బహు పాత్రలను ఏకకాలంలో సమర్థంగా పోషించగలిగే సత్తా మహిళలకే ఉంటుందని ఎవరైనా అంగీకరించక తప్పదు. నేడు అంతర్జాతీయ తల్లుల దినోత్సవం(ఇంటర్నేషనల్ మదర్స్ డే) సందర్భంగా భిన్నరంగాల్లో రాణిస్తూ, కుటుంబాలను తీర్చిదిద్దుతున్న మహిళామణులపై ప్రత్యేక కథనాలు.

...మరిన్ని కథనాలు 10లో

- పిల్లల పోషణ, ఉద్యోగ బాధ్యతల్లో మహిళల రాణింపు
- వృత్తి'ధర్మం'లో తేడా రాకుండా విజయకేతనం

నేడు అంతర్జాతీయ తల్లుల దినోత్సవం



సవాళ్లను ఎదుర్కొంటూ...

– ఖమ్మం ట్రాఫిక్ సీఐ అంజలి

ఖమ్మంక్రైం: ఆమెది సవాళ్లతో కూడిన పోలీస్ ఉద్యోగం. రాత్రీపగలు తేడా లేకుండా ఒత్తిళ్లతో కూడిన విధులు నిర్వర్తిస్తూనే చిన్నారులైన ఇద్దరు పిల్లలను తీర్చిదిద్దుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఖమ్మం ట్రాఫిక్ సీఐ అంజలి. ఆమె భర్త కల్యాణ్ కూడా పోలీసు శాఖ ఉద్యోగి కావడంతో విధుల్లో బిజీగానే ఉంటారు. దీంతో సీఐ అంజలి ఓవక్క విధులు నిర్వర్తిస్తూనే పదేళ్ల కుమారుడు చాణక్య, ఆరేళ్ల కుమార్తె చిన్మయికి తల్లి ప్రేమ దూరం కాకుండా వ్యవహరిస్తున్నారు. పిల్లల ఆలనాపాలనా చూస్తూ ఇటు సీఐగా విధినిర్వహణలో రాణిస్తున్నారు. పిల్లల బాధ్యత ఎవరిపై వదిలివేయకుండా స్కూల్‌కు రెడీ చేశాకే తాను విధులకు వెళ్తానని, ఏ కాస్త ఖాళీ దొరికినా ఇద్దరు పిల్లలతో గడపడమే సంతోషాన్ని ఇస్తుందని అంజలి వెల్లడించారు.



కుమార్తెకు జడ వేస్తున్న భానుమతి



కుటుంబం కోసం కష్టాలూ ఇష్టంగా మారాయి..

– భద్రాద్రి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంటౌన్: ఇంట్లో తల్లిగా, భార్యగా.. కోర్టుకు వెళ్తే కష్టాల్లో ఉన్న వారికి న్యాయం చేసే న్యాయమూర్తిగా మారిపోతానని చెబుతున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి. అటు కుటుంబం, ఇటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయమై భానుమతి వెల్లడించిన వివరాలు ఆమె మాటల్లోనే... కోర్టు పనుల్లో ఎంత ఒత్తిడి ఉన్నా ఆ ప్రభావం పిల్లలపై పడకుండా తల్లిగా వారికి ప్రేమ పంచుతూ, బాధ్యతలపై అవగాహన కల్పిస్తున్నా. తల్లిగా పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దడం, భార్యగా భర్తకు అండగా నిలవడమే కాక న్యాయమూర్తి విధులకు సమన్యాయం చేయడం కష్టమే అయినా ఇష్టంగా చేస్తున్నా. జర్నలిస్టు కొత్తపల్లి శేషుతో నాకు వివాహమైంది. మా అబ్బాయి కొత్తపల్లి సుపీత్ర ఎనిమిదో తరగతి, కుమార్తె హరిచందన ఆరో తరగతి చదువుతున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు నిద్రలేవడంతో దినచర్య ప్రారంభిస్తాను. పిల్లలకు స్వయంగా వంట చేసి పాఠశాలకు పంపిస్తాను. అమ్మాయికి జడ వేయడం మొదలు అన్ని పనులూ నేనే చూసుకుంటా. ఉదయం తొమ్మిది గంటలకు కోర్టుకు వెళ్లి సాయంత్రం పిల్లలను ఇంటికి తీసుకొచ్చాక గృహిణిగా మారిపోతాను. నా భర్త అండదండలతో అటు విధులు, ఇటు కుటుంబ బాధ్యతలను నిర్వర్తించగలుగుతున్నాను.



విధుల్లో భానుమతి

కాంగ్రెస్‌లో జోష్!

- కర్ణాటక విజయంతో పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం
- జిల్లాలో నాయకుల సంబురాలు
- ఉమ్మడి జిల్లాలో రాజకీయ పరిణామాలపై చర్చ



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కర్ణాటక విధాన సభ ఎన్నికల ఫలితాలు జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహాన్ని తెచ్చాయి. అక్కడ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పార్టీ కేడర్, నేతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పార్టీకి ఈ ఫలితాలు పునరుత్తేజం కలిగించేవిగా ఉన్నాయని నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యాన జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కేడర్ సంబురాల్లో మునిగింది. తెలంగాణలోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని.. గత రెండు ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలు సాధించిన నేపథ్యాన వచ్చే ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలను వస్తాయనే ధీమా ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఏదిఏమైనా కర్ణాటక ఎన్నికల ఫలితాలు.. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీశాయి.

ఉమ్మడి జిల్లా నుంచే మెజార్టీ స్థానాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. 2018 ఎన్నికల్లో మధిర, పాలేరు, కొత్తగూడెం, భద్రాచలం, పినపాక, ఇల్లెందు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో నలుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలే మిగిలారు. ఈక్రమంలో నియోజకవర్గాల వారీగా సరైన నాయకత్వం లేకపోవడంతో కేడర్ దిక్కుతోచని స్థితిలో ఉంది. నియోజకవర్గాల్లో స్థానికంగా ఉండే నేత లేకపోవడంతో పార్టీలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యాన సంస్థాగతంగా బలం ఉన్నప్పటికీ సరైన నాయకత్వ లేమితో చుక్కాని లేని నావలా కాంగ్రెస్ పార్టీ మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జవసత్వాలు నింపేలా..

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అత్యధిక స్థానాలు గెలిచినా.. రాష్ట్రంలో అధికారంలోకి రాకపోవడంతో కేడర్‌లో నైరాశ్యం నెలకొంది. అధిష్టానం, టీపీసీసీ పిలుపునిచ్చే కార్యక్రమాలు నిర్వహించడం.. ప్రజల్లోకి వెళ్లడం, వారి సమస్యలపై పోరాటాలు చేయడం వంటివి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చేస్తున్నారు. ఈ సమయంలో కర్ణాటక విధాన సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం.. రాష్ట్రంతోపాటు జిల్లాలోనూ ఆ పార్టీకి కొత్త ఊపిరిలూదింది. కర్ణాటక ఫలితాలు తెలంగాణలోనూ పార్టీకి అనుకూల పవనాలు వీయడానికి తోడ్పడతాయని పార్టీ కేడర్ అభిప్రాయపడుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనడానికి ఈ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఆక్సిజన్‌లా ఉపయోగపడతాయనడంలో అతిశయోక్తి లేదనే ధీమా ఆ పార్టీ నాయకుల్లో వ్యక్తమవుతోంది.

సంబరాల్లో కేడర్..

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో డీసీసీ ఆధ్వర్యాన సంబరాలు మిన్నంటాయి. ఖమ్మంతోపాటు నియోజకవర్గాల్లోని కేడర్‌లో జోష్ నిండింది. తెలంగాణలోనూ కాంగ్రెస్ గెలుపు ఖాయమంటూ నినాదాలు చేశారు. ఖమ్మంలో జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావేద్, నాయకుడు ఎం.డీ.ముస్తఫా ఆధ్వర్యాన ర్యాలీలు నిర్వహించడమే కాక ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుని స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే వైరాలో నేతలు టపాసులు కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. సత్తుపల్లి, మధిర, పాలేరు నియోజకవర్గాల్లో కూడా కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు.

విధుల్లోకి జేపీఎస్‌లు..

- జిల్లాలో అందరూ లేఖలు ఇచ్చారని అధికారుల వెల్లడి
- సోమవారం నుంచి విధుల్లోకి..

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యాన జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)లు విధుల్లో చేరారు. శనివారం రాత్రి వరకు జిల్లాలోని జేపీఎస్‌లంతా విధుల్లో చేరారని అధికారులు వెల్లడించారు. నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయిన నేపథ్యాన సర్వీస్ క్రమబద్ధీకరించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు సమ్మె బాట పట్టిన విషయం విదితమే. జిల్లాలోని 20 మండలాల్లో 589 గ్రామపంచాయతీలకు గాను 463 మంది జేపీఎస్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా తమను రెగ్యులర్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో సమ్మెకు దిగారు. అయితే, విధుల్లో చేరకపోతే సర్వీస్ నుంచి తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. అంతేకాక కొత్త కార్యదర్శుల నియామకానికి సిద్ధం కావడంతో జేపీఎస్‌ల్లో శుక్రవారం సాయంత్రం కొందరు, మిగతా వారు శనివారం రాత్రి నాటికి విధుల్లో చేరారు.

ప్రొబేషనరీ కాలం ముగియడంతో...

జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా చేరిన సమయాన ప్రొబేషనరీ కాలాన్ని మూడేళ్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తర్వాత మరో ఏడాది పొడిగించి వేతనాన్ని దాదాపు రెట్టింపు చేసింది. అయితే నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం గత నెల 11వ తేదీతో ముగిసింది. దీంతో సర్వీస్ క్రమబద్ధీకరించకపోతే సమ్మె చేస్తామని జేపీఎస్‌లు నోటీసు ఇచ్చారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట దీక్షలు నిర్వహిస్తూ సమ్మె దిగారు. ఈక్రమంలో ప్రభుత్వం 9లోగా విధుల్లో చేరకపోతే టర్మినేట్ చేస్తామని హెచ్చరించినా స్పందన రాలేదు. మళ్లీ శుక్రవారం సాయంత్రం వరకు గడువు విధించగా జిల్లాలో 80 మందే చేరారు. ఇదే పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉండటంతో సీఎస్ శాంతికుమారి శనివారం మధ్యాహ్నం 12 గంటల్లోగా జేపీఎస్‌లు విధుల్లో చేరకపోతే కొత్త వారిని నియమిస్తామని స్పష్టం చేశారు. దీంతో జిల్లాలోని జేపీఎస్‌లు మొత్తం శనివారం రాత్రి వరకు విధుల్లో చేరుతున్నట్లు అధికారులకు లేఖలు ఇచ్చారు. కాగా, జిల్లాలోని 463 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల్లో 18మంది ప్రసూతి సెలవుల్లో ఉన్నారు. వీరుకాక 445 మందిలో శుక్రవారం 80 మంది, మిగతా వారు శనివారం విధుల్లో చేరారని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ అప్పారావు వెల్లడించారు. ఇదిలా ఉండగా జేపీఎస్‌లు సమ్మె చేస్తుండగానే మార్చి వేతనాన్ని ప్రభుత్వం శుక్రవారం వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో ఊరట చెందిన జేపీఎస్‌లు విధుల్లో చేరేందుకు ముందుకొచ్చినట్లు సమాచారం. కాగా, సమ్మె విరమిస్తున్నట్లు జేపీఎల్ సంఘం బాధ్యులు శుక్రవారం రాత్రి ప్రకటించడంతో సోమవారం నుంచి విధులకు హాజరుకానున్నారు.

అలా కలిశారు..!



ఖమ్మం రూరల్ మండలంలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డులో మండలానికి చెందిన సీపీఐ నాయకుడి కుమారుని వివాహం శనివారం జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఎదురుపడిన వీరు ముగ్గురు పలకరించుకుంటుండగా.. మూడు పార్టీల పొత్తులపై చర్చ జరుగుతున్న నేపథ్యాన ఇతర నాయకులు ఆసక్తిగా విన్నారు. – ఖమ్మం రూరల్

మహిళలంటే బీజేపీకి చిన్నచూపు

- రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని అరెస్ట్ చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తమ్మినేని, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశం తరపున పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లపై ఎంపీ, రెజ్లర్ల సంఘం అధ్యక్షుడు లైంగిక వేధింపులకు పాల్పడితే కేంద్రప్రభుత్వం కనీసం స్పందించడం లేదని.. మోదీ ప్రభుత్వానికి మహిళలంటే చిన్నచూపనే విషయం ఈ ఘటనతో తేలిపోయిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో శనివారం ఖమ్మంలో సుందరయ్య భవనం నుంచి సరితా క్లినిక్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బీజేపీ కనీస ప్రజాస్వామ్యాన్ని పాటించడం లేదని ఆరోపించారు. ప్రతిపక్షాలపై బురద జల్లేందుకు ఇటీవల ఓ సినిమాకు అనుమతి ఇవ్వగా, ఈ సినిమా చూసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నాయకుడు బండి సంజయ్ కమ్యూనిస్టులు, ముస్లింలపై తన అక్కసు వెళ్లగక్కాడని తమ్మినేని తెలిపారు. కాగా, జేపీఎస్‌లు శనివారం మధ్యాహ్నం వరకు విధుల్లో చేరకుంటే ఉద్యోగాలు పోయినట్లేనని రాష్ట్రప్రభుత్వం చేసిన ప్రకటన సరికాదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగిన వారితో చర్చించాలని కోరుతూ తాను స్వయంగా సీఎం కేసీఆర్‌కు లేఖ రాసి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తే ప్రభుత్వం ఖాతర్ చేయడం లేదని వీరభద్రం తెలిపారు. బీజేపీకి వ్యతిరేకంగా కర్ణాటక ప్రజలు తీర్పు ఇచ్చిన నేపథ్యాన దేశవ్యాప్తంగా మోదీ పాలనపై మరిన్ని ఉద్యమాలు చేపట్టేందుకు సీపీఎం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, మాచర్ల భారతి, బండి పద్మ, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, పి.రమ్య, బాగం అజిత పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీలో జాప్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లిబాబు

ఖమ్మంవ్యవసాయం: గొర్రెల పంపిణీలో జాప్యాన్ని అరికట్టి లబ్ధిదారులకు వెంటనే జీవాలు అందేలా చర్యలు తీసుకోవాలని గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షులు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని అఖిల భారత యాదవ మహాసభ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రెండో విడత గొర్రెల కోసం జిల్లాలో 10 వేల మంది రూ.43,750ల చొప్పున డీడీ తీసి పది నెలలు గడుస్తున్నా జీవాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి గొర్రెల పంపిణీకి బదులుగా నగదు బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, కార్పొరేషన్ల పరిధిలో కురుమ, యాదవులకు పాడి గేదెలు మంజూరు చేయాలని, దళితబంధు మాదిరి కురమ, యాదవ బంధు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘం డైరెక్టర్ పల్లెబోయిన శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి గూదె భద్రయ్యతో పాటు నూకల వెంకన్న, ముత్తెబోయిన రాంమ్మూర్తి, దొంతెబోయిన ఉపేందర్, బట్ట కోటేశ్వరరావు, మందా నాగేశ్వరరావు, బండారి ప్రభాకర్, మల్లేష్, జోనెబోయిన పాపయ్య పాల్గొన్నారు.

ఎన్‌ఈపీ, సీపీఎస్ రద్దు కోసం పాదయాత్ర

ఎస్‌టీఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షుడు చావా రవి



మాట్లాడుతున్న చావా రవి

ఖమ్మం సహకారనగర్: నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ(ఎన్‌ఈపీ), కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలని కోరుతూ జూలైలో పాదయాత్ర చేపట్టనున్నామని ఎస్‌టీఎఫ్‌ఐ(స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయ ఉపాధ్యక్షుడు, టీఎస్ యూటీఎఫ్(తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి వెల్లడించారు. ఖమ్మంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 12వ తేదీన డివిజన్, జిల్లా కేంద్రాల్లో 24 గంటల నిరవధిక నిరాహార దీక్ష చేపడుతామని తెలిపారు. షేర్ మార్కెట్లో పెట్టిన పింఛన్ సొమ్ము వెనక్కు ఇవ్వాలని, ఎన్‌ఈపీని రద్దు చేయడంతోపాటు చరిత్ర పాఠాలు, శాస్త్రీయ అంశాలను తొలగించడాన్ని నిరసిస్తూ దశలవారీ పోరాటాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా, అశాస్త్రీయ భావాలు, మూఢనమ్మకాలను పెంచేలా ఉన్న జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ప్రత్యామ్నాయ శాస్త్రీయ విద్యా విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇక రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను విచారించి రెజ్లర్లకు తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు. ఇంకా ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను శాశ్వతంగా నియమించాలని, ఉపాధ్యాయులకు ప్రతినెలా వేతనం మొదటి తేదీనే విడుదల చేయాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని, షేక్ మహబూబ్ అలీతో పాటు బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఖమ్మం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు. అలాగే, సాయంత్రం 4.30 గంటలకు రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో, 5.30కు అల్లిపురంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు. అతర్వాత నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నారు.

కర్ణాటక ప్రజల తీర్పును ఆహ్వానిస్తున్నాం..

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: కర్ణాటకలో మత విద్వేష, ఫాసిస్టు బీజేపీని ఓడించిన ప్రజల తీర్పును ఆహ్వానిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పష్టమైన మెజారిటీతో బీజేపీని మట్టి కరిపించడం ద్వారా కొనుగోలు రాజకీయాలకు అక్కడి ప్రజలు తెర వేశారని తెలిపారు. అవినీతి, మత విద్వేష, ఉన్మాద పూరిత ఫాసిస్టు పాలనకు కర్ణాటకను వాడుకున్న బీజేపీకి కర్ణాటక ప్రజలు చెప్పిన గుణపాఠం.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశ తీర్పుగా మారాలని ప్రజాపంథా ఆశిస్తోందని రంగారావు పేర్కొన్నారు.

అటవీ అభివృద్ధి పనుల పరిశీలన



అర్బన్‌పార్కులో పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రేంజ్‌లో గత ఆర్థిక సంవత్సరం చేపట్టిన అటవీ అభివృద్ధి పనులను అటవీశాఖ ప్రత్యేక బృందం శనివారం పరిశీలించింది. చాతకొండ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస రెడ్డి, ఎఫ్ఎస్ఓ నరేష్, ఎఫ్‌బీఓ శివ బృందం రేంజ్‌లోని ఆర్.సీ.పురం, మందాకిని నర్సరీలు, కిష్టారం, జగన్నాథపురం ప్లాంటేషన్, అర్బన్‌పార్క్, చంద్రాయపాలెం ప్లాంటేషన్, భువన్నపాలెం చెక్‌డ్యాం పనులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. డీఆర్ఓ ముత్యాలరావు, ఎఫ్ఎస్ఓలు నర్సింహా, ఎఫ్‌డీఓ ముత్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మలందరికీ వందనం!



- అడ్డంకులను అధిగమిస్తూ విజయాలు
- అటు ఉద్యోగం, ఇటు రాజకీయాల్లో ముందడుగు
- కష్టాలెదురైనా చిరునవ్వుతో స్వీకరిస్తున్న తల్లులు

అమ్మ సేవ అజరామరం



సైదులుకు భోజనం తినిపిస్తున్న వెంకటలక్ష్మి

ఖమ్మంగాంధీచౌక్: జన్మనిచ్చిన అమ్మ బిడ్డ కష్టాల్లో భాగస్వామ్యమవుతుంది. కన్న కొడుకు పుట్టుకతోనే దివ్యాంగుడైతే ఆ అమ్మ మనసులో వేదన ఉన్నప్పటికీ సేవ చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఖమ్మం శ్రీనివాస్‌నగర్ కు చెందిన కాటి వెంకటలక్ష్మి, వీరయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సైదులు పుట్టకతోనే దివ్యాంగుడు కావడంతో కూలీనాలి పనులు చేస్తూ జీవనం సాగించే వెంకటలక్ష్మి, వీరయ్యలు ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. అయినా రెండు, కాళ్లు, రెండు చేతులు పూర్తిగా పనిచేయక పోవడంతో 30 ఏళ్లుగా వెంకటలక్ష్మి కొడుకుకు చంటి బిడ్డలా సపర్యలు చేస్తోంది. పదహారేళ్ల క్రితం భర్త వీరయ్య చనిపోగా, చిన్నచిన్న కూలీ పనులకు వెళ్తూ సైదులుకు స్నానం చేయించటం, భోజనం తినిపించటం సహా అన్ని పనులే ఆమె చేస్తోంది. ఇక ప్రభుత్వం దివ్యాంగులకు ఏర్పాటుచేసిన పాఠశాలకు సైదులును పంపిస్తూ విద్యార్థిగానూ తీర్చిదిద్దుతోంది.

వ్యాపారవేత్తగా.. అమ్మగా...



కుమార్తె, కుమారుడితో ఉష

ఖమ్మంగాంధీచౌక్: వ్యాపారవేత్తగా, అమ్మగా ఆనందమయ జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు ఉషా కలకోట. గృహిణిగా తల్లి రాజేశ్వరి నేర్పిన పాఠాలే తనను తీర్చిదిద్దాయని ఉష చెబుతారు. బీకాం చదివిన ఉష అమ్మ, భర్త, ఓ స్నేహితురాలి ప్రోత్సాహంతో 13 ఏళ్ల క్రితం ఫ్యాబ్రిక్ డిజైనర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. పత్తి వ్యాపారి భర్త సత్యంబాబు సహకారంతో తాను రాణిస్తూనే మరో ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఉషా, సత్యంబాబు దంపతులకు కొడుకు సాయికేశవ్ పూణేలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, కూతురు సాయి చిన్మయి నిట్‌లో ఇంజనీరింగ్ చేస్తోంది. ఈసందర్భంగా ఉష మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధి, పిల్లలను తీర్చిదిద్దడంలో రాణించాననే తృప్తి ఉందని తెలిపారు.

ఈ ప్రేమకు 31ఏళ్లు



ప్రవీణ్‌కు అన్నం తినిపిస్తున్న తల్లి పద్మ

వైరారూరల్: పిల్లలు పుట్టగానే తల్లి ఆనందానికి అవధులు ఉండవు. ఒక్కో అడుగు వేస్తుంటే తానే విజయం సాధించినట్లు తల్లి ఉప్పొంగిపోతుంది. కానీ పేగు తెంచుకుని పుట్టిన కొడుకు 31 ఏళ్లు వచ్చినా తన పని తాను చేసుకోలేని స్థితిలో ఆ తల్లే అన్నీ తానై సేవలందిస్తోంది. వైరా మున్సిపాలిటీ పరిధి గండుగలపాడుకు చెందిన పూర్ణకంటి వెంకటేశ్వర్లు, పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పన్నెండేళ్ల క్రితం వెంకటేశ్వర్లు చనిపోవడంతో కుమారులకు అన్నీ తానే అయ్యింది. కూలీ పనులు చేస్తూ చిన్న కుమారుడు లోకేష్‌ను డిగ్రీ వరకు చదివించగా.. పెద్దకుమారుడు ప్రవీణ్ జన్యుపరమైన వ్యాధితో జన్మించడంతో శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లేదు. దీంతో ఎవరి ఆధారం లేకుండా కూర్చోవడం కూడా సాధ్యం కాని ఆయనను తల్లి పద్మ కంటికి రెప్పలా కాపాడుతోంది. కొడుకును అన్నం తినిపించడం, స్నానం చేయించడమే కాకుండా ఇతర సేవలన్నీ ఆమె చేస్తోంది.

అందరికీ బంగారు బాటలు



కుమార్తెలతో సాజీ దంపతులు

ఏన్కూరు: ఇంట్లో ఒక ఆడపిల్ల పుడితేనే భారమనుకునే రోజులివి. ఇక నలుగురూ ఆడపిల్లలే పుట్టినా భారంగా భావించకుండా బాధ్యతగా తీసుకుని వారిని ఉన్నత స్థాయికి చేర్చింది ఆ తల్లి. ఏన్కూరు మండలం కోనాయిపాలెంకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు భూక్యా చందులాల్, భూక్యా సాజీ దంపతులకు తొలుత కుమారుడు జన్మించి మృతి చెందాడు. ఆతర్వాత నలుగురు కుమార్తెలు జన్మించారు. అయితే, సాజీ ఐదో తరగతి వరకే చదవగా తన పిల్లలను మాత్రం ఉన్నత స్థాయికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. సాజీ 2006 నుండి 2011 వరకు ఏన్కూరు జెడ్పీటీసీగా పనిచేయగా.. తన లక్ష్యం మేరకు పిల్ల లకు మంచి చదువులు చెప్పించింది. దీంతో పెద్దకుమార్తె శారదాబాయి బీఏ, బీఈడీ పూర్తిచేసి ఏన్కూరు మండలం అక్కినా పురం తండా ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం, రెండో కుమార్తె విజయశాంతి ఎంటెక్ చదివి ఆర్టీసీలో డీఎంగా చేసి ప్రస్తుతం కొత్తగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా,మూడో కుమార్తె శివజ్యోతి ఎమ్మెల్సీ, బీఈడీ చేసి పాల్వంచ కిన్నెరసానిలో స్కూల్ అసిస్టెంట్‌గా, నాలుగో కుమార్తె బి.కృష్ణకుమారి ఎంటెక్ పూర్తి చేసి సత్తుపల్లి మున్సిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ డపిల్లలను భారంగా భావించకుండా ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని చెబుతోంది భూక్యా సాజీ.

అమ్మగా.. అధికారిగా...



కుటుంబసభ్యులతో ఉద్యాన అధికారి అనసూయ

ఖమ్మంవ్యవసాయం: అమ్మ నుంచి నేర్చుకున్న పాఠాలతో ఉన్నత స్థాయికి ఎదిగారు గుండె అనసూయ. ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాభివృద్ధి శాఖ అధికారిగా పనిచేస్తున్న ఆమె తల్లిగా పిల్లల ఉన్నతికి పాటుపడుతూ మరోవైపు జిల్లా అధికారిగా అన్నదాతలకు సేవలందిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన అనసూయ తండ్రి వెంకయ్య టెలికాం శాఖలో చిరుద్యోగి. ఐదుగురు పిల్లలతో ఉన్న ఆ కుటుంబం తండ్రి సంపాదన సరిపోకపోవటంతో తల్లి సాయమ్మ కూలీ పనులకు వెళ్తూనే పిల్లల ఆలనా పాలన చూసుకునేది. అలా తల్లి నుంచి పుణికిపుచ్చుకున్న లక్షణాలతో ఎమ్మెల్సీ, బీఈడీ చదివి ప్రైవేట్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తూనే పట్టు పరిశ్రమ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించారు. భద్రాచలం, ఖమ్మంలో చదివిన ఆమె భర్త హిందీ పండిట్‌గా పనిచేస్తుండగా, కొడుకు యశస్వి విజయ్ ఇంజనీరింగ్, కుమార్తె జ్యోతిక ఇంటర్ పూర్తిచేసింది. ఉదయాన్నే పిల్లలు, తమకు సరిపడా వంట చేసి క్యారేజీలు కట్టడం.. ఆపై విధులు నిర్వర్తించడం సవాలే అయినా భర్త సహకారంతో విజయవంతంగా నిర్వర్తించానని అనసూయ తెలిపారు. అప్పుడప్పుడు పని ఒత్తిడితో పిల్లలతో గడపలేని సందర్భాలు ఎదురైనా అందరి సహకారంతో అధిగమిస్తున్నానని వెల్లడించారు.

నలుగురం ఉన్నత స్థాయిలో...



ముగ్గురు అక్కలు, తల్లితో డాక్టర్ వసుమతీదేవి

సత్తుపల్లిటౌన్: 'మా అమ్మ అనంతం లక్ష్మి హిందీ పండిట్‌గా, నాన్న దశరథరామయ్య హెచ్ఎంగా విధులు నిర్వర్తించేవారు. మేము నలుగురం ఆడపిల్లలమే కావటంతో హిందీ పండిట్‌గా ఉద్యోగం మా అమ్మ లక్ష్మి గృహిణిగా ఉంటూ ఉన్నతంగా తీర్చిదిద్దింది. మా అక్క లలిత టీచర్‌గా, ఇంకో అక్కడ ఇందిర న్యూజిలాండ్‌లో ప్రొఫెసర్‌గా, శ్రీదేవి కోయ్యలగూడెంలో హెచ్ఎంగా చేస్తున్నారు. నేను ప్రభుత్వాస్పత్రిలో వైద్యురాలిగా స్థిరపడ్డా. మా నలుగురిని ఉన్నతంగా తీర్చిదిద్దటంలో అమ్మ కృషి మరువలేనిది. రాత్రిపూట మేం ఎంత చదువుకున్నా మాతో ఉంటూ ప్రోత్సహించేది. ఆస్తి, అంతస్తుల కంటే చదువు, నీతి, నిజాయతీ ముఖ్యమనే అమ్మ మాటలు ఈ స్థాయికి తీసుకొచ్చాయి. ఆడపిల్లలను ఏ మాత్రం తక్కువగా చూడకుండా చేయూతనిస్తే ఏ రంగంలోనైనా దూసుకెళ్తారు' అని సత్తుపల్లి ఏరియా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ వసుమతీదేవి వెల్లడించారు.

అమ్మతనం.. తీయదనం



తరాల అమ్మలు రత్తమ్మ, నిర్మల, సునీత, రత్తమ్మ మనువరాలు హంసినీ రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: తరాలు మారినా.. అమ్మ అమ్మే. కష్టమొచ్చినా, సుఖమొచ్చినా ముందుగా గుర్తుకొచ్చేది తల్లే. పిల్లలు ఉన్నతంగా ఉంటే మొదట ఆనందపడేది అమ్మే. ఈ ఫొటోలో ఉన్న నలుగురిలో 88 ఏళ్ల వయసుతో ఉన్న గుండా రత్తమ్మ, రాజిరెడ్డి దంపతులది ఓ తరం. ఆమె కూతురు 66 ఏళ్ల వీసారపు నిర్మలది ఓ తరం, ఈమె కూతురు గుండా సునీతది ఇంకో తరం. ఇక సునీత కుమార్తె హంసినీరెడ్డి నేటి తరం ఇంజనీరింగ్ విద్యార్థిని. రత్తమ్మ పేగుబంధం ఎనిమిది మంది కాగా వారి 34 మంది పిల్లలంతా కలిస్తే పెద్ద బలగమేనని చెప్పాలి. అందరి యోగక్షేమాలు తెలుసుకుంటేనే తన కడుపు నిండినట్లుగా ఉంటుందని చెబుతున్నారు రత్తమ్మ!

రెండోరోజుకు చేరిన రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీ



ఖమ్మం- ఉప్పల చెలక జట్ల మ్యాచ్ దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: దివంగత సీఎం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌ల్లో సూర్యాపేట – ములుగు జట్లు తలపడగా 31–26 పాయింట్ల తేడాతో సూర్యాపేట జట్టు, హన్మకొండ–గుబ్బగుర్తి జట్ల నడుమ మ్యాచ్‌లో 23–22 తేడాతో హన్మకొండ జట్టు, ఖమ్మం–ఉప్పలచెలక నడుమ మ్యాచ్‌లో 51–29 తేడాతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం – కల్లూరు జట్ల నడుమ మ్యాచ్‌లో 40–22 తేడాతో భద్రాద్రి జట్టు గెలుపొందింది. కాగా, పోటీల నిర్వాహకుడు బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లమల రంజిత్‌ను సినీనటుడు బాలకృష్ణ ఫోన్ ద్వారా అభినందించారు. మ్యాచ్‌ల నిర్వహణ, క్రీడాకారుల వసతి సౌకర్యాలపై ఆయన అడిగి తెలుసుకున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి షాక్‌తో మృతి

ఖమ్మంఅర్బన్: విద్యుత్ తీగల సాయంతో చేపలు పట్టేందుకు వెళ్లిన ఖమ్మం యూపీహెచ్ కాలనీ రాజీవ్‌నగర్‌గుట్టకు చెందిన కోడిరెక్కల రవి(45) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఖానాపురం ప్రశాంతినగర్ సమీపాన సాగర్ ప్రధాన కాల్వలో విద్యుత్ తీగల సాయంతో చేపలు పట్టేందుకు రవి, ఆయన స్నేహితుడు వెళ్లారు. ఈక్రమంలోషాక్ కొట్టడంతో రవిని వీరబాబు ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు భార్య స్వరూప ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

నగరంలోని రామన్నపేటకు చెందిన వివాహిత జి.లింగమ్మ(56) ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఎవరూలేని సమయంలో ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించింది. ఆమె కుమార్తె ఫోన్ చేస్తే తీయక పోవడంతో వచ్చి చూసేలోగా మృతి చెందింది.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారంలో బాల్యవివాహం జరుగుతుందనే సమాచారంతో అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలికకు ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన యువకుడి ఏడుకొండలుతో శనివారం ఉదయం గట్టుసింగారంలో వివాహానికి ఇరుకుటుంబాలు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు సమాచారం అందుకున్న చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్ ఆలేటి నీరజ వెళ్లి వివాహాన్ని నిలిపి వేయించారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి 18 ఏళ్లు నిండాకే వివాహం జరిపిస్తామని హామీపత్రం తీసుకున్నారు.

బంగారం, నగదు చోరీ

కారేపల్లి : ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగానే లోనకు ప్రవేశించిన దుండగులు బీరువా తాళం పగులకొట్టి నగదు, బంగారం అపహరించుకుపోయిన ఘటన మండలంలోని సీతారాంపురంలో శనివారం చోటు చేసుకుంది. సీతారాంపురం గ్రామానికి చెందిన ఉప్పునూరి వెంకటరెడ్డి తన కుటుంబ సభ్యులతో నిద్రిస్తుండగా శనివారం తెల్లవారుజామున దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. చెక్క బీరువా తాళం ప గులకొట్టి రెండు తులాల బంగారం, రూ.50వేలు అపహరించుకుపోగా బాధితుల ఫిర్యాదుతో ఎస్ఐ పి.రామారావు దర్యాప్తు చేపట్టారు.

మాయమాటలతో రూ.3.15లక్షలు స్వాహా

చింతకాని: మాయమాటలు చెప్పిన సైబర్ నేరగాళ్లు మండలంలోని ఇద్దరి నుంచి రూ.3.15లక్షలు స్వాహా చేశారు. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఓఎల్ఎక్స్‌లో టీ స్టాండ్ అమ్మకానికి పెట్టాడు. దీంతో సైబర్ నేరగాడు స్టాండ్ కొనుగోలు చేస్తే క్యూఆర్ కోడ్ పంపాలని సూచించాడు. దీంతో క్యూఆర్ కోడ్ పంపగా యువకుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 1.15 లక్షలు కాజేశాడు. అలాగే మత్కేపల్లిలో ఓ యువకుడికి వాట్సాప్ ద్వారా పరిచయమైన సైబర్ నేరస్తులు కొంత నగదు పెట్టుబడి పెడితే 30 శాతం అదనంగా చెల్లిస్తామని చెప్పటంతో నమ్మి రూ.2 లక్షలు ఖాతాకు పంపాడు. ఆతర్వాత మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

కొణిజర్ల: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఎస్ఐ జె.శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా శాంతినగర్‌కు చెందిన పమ్మి గాంధీ(48), కర్లకంటి నాగరాజు ఖమ్మం నుంచి వైరాకు శనివారం ద్విచక్ర వాహనంపై వెళ్లే క్రమాన హెచ్‌పీ బంక్‌లోకి వెళ్లేందుకు మలుపు తీసుకుంటుండగా వెనక నుంచి వస్తున్న బుల్లెట్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెనక కూర్చున్న గాంధీ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా, నాగరాజుకు గాయాలయ్యాయి. అలాగే, బుల్లెట్ నడుపుతున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన టోయ్‌పాయ్ సరోజ్ స్వల్పంగా గాయపడ్డాడు.

గేదెను తప్పించబోయి ఒకరు..

కామేపల్లి(కారేపల్లి): గేదెను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారేపల్లి మండలం పాత కమలాపురానికి చెందిన వడ్డే రాంబాబు(46) ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా కామేపల్లి మండలం కొత్తలింగాల క్రాస్ రోడ్డు వద్ద గేదెఅడ్డుగా వచ్చింది. దీంతో గేదెను తప్పించే క్రమంలో రోడ్డుపై నడుస్తూ వెళ్తున్న కొత్తలింగాలకు చెందిన దార మోషేను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాంబాబు మృతి చెందాడని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పెనుబల్లి మండలంలో..

పెనుబల్లి : మోటారుసైకిల్ పైనుండి జారిపడడంతో తీవ్ర గాయాలు కాగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన సుందర్‌లాల్ యాదవ్(24) ద్విచక్రవాహనంపై తిరువూరు నుండి శుక్రవారం రాత్రి వీఎం.బంజర్ వస్తుండగా మండలంలోని ముత్తుగూడెంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యపు రాశుల వద్ద జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో సుందర్‌లాల్ తలకు తీవ్ర గాయాలు కాగా, వాహనదారులు గుర్తించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయనకు పెనుబల్లిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సుందర్‌కు భార్యతో పాటు ఐదు నెలల కుమార్తె ఉన్నారు.